



విజయనగరం: విద్యుత్ వెలుగుల్లో గుడివీధిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం

శివ పూజకు వేళాయె

● నేడు ఎస్.కోట పుణ్యగిరి మహాశివరాత్రి జాతర ● అర్ధరాత్రి నుంచి కొండపై సందడి ● సంగాంలో ఐదు రోజుల ఉత్సవం ● రామతీర్థంలోనూ జాతర



విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ శృంగవరపుకోట/ వంగర/ నెల్లిమర్ల

మహా శివరాత్రి పూజలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ఉపవాసాలతో స్వామిని పూజించేందుకు భక్తులూ ఎదురుచూస్తున్నారు. అందులోనూ పేరెన్నికగన్న క్షేత్రాలకు వెళ్లాలని ఎక్కువ మంది భావిస్తారు. వాటిలో ఎస్.కోట పుణ్యగిరి ప్రత్యేకం. చుట్టూ పచ్చని కొండలు.. ఎక్కడ నుంచి వస్తుందో తెలియని పుట్టదార.. వివిధ స్నాన ఘట్టాలు పుణ్యగిరి కొండ ప్రాచుర్యాన్ని చాటుతున్నాయి. కొండపై ఉమాకోటి లింగేశ్వర స్వామి కొలువై ఉన్నారు. మహాశివరాత్రి జాగారాలు చేసే భక్తులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి కొండకు వస్తారు. శనివారం సాయంత్రం వరకు భక్తుల తాకిడి విపరీతంగా ఉంటుంది.

● కొండ దిగువ నుంచి స్వామి వద్దకు చేరుకొనేందుకు నడక తప్పనిసరి. 314 మెట్లను ఎక్కాల్సిందే. మార్గమధ్యలో దార గంగమ్మ లోయ స్నాన ఘట్టం.. కోటి లింగాల స్నాన ఘట్టం.. పుట్టదార స్నాన ఘట్టం ఎదురుపడతాయి. వాటి వద్ద స్నానం చేసే భక్తులు చివరిగా స్వామిని దర్శించుకోవడంతో ఈమహా శివరాత్రి జాతర ముగుస్తుంది. కొండపైకి ఎక్కేటప్పుడు మెట్లదారిలోనూ, దిగేటప్పుడు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మార్గంలో భక్తులను మళ్లించాలన్న ఆలోచన అధికారులు ఉన్నారు. ఇలాయితే భక్తుల తోపులాటకు అవకాశం ఉండకపోవచ్చు.

● వంగర మండలం సంగాంలో ఉన్న త్రివేణి సంగమం (వేగావతి, నాగావళి, సువర్ణముఖీ) నదుల ప్రాంగణంలో ఉన్న సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పూజలు వైభవంగా జరుగుతాయి. ఐదు రోజుల పాటు జాతర జరుగుతుంది. సంధ్యాస్నానం అనంతరం ఆలయ ఆవరణంలో భక్తుల దర్శనం కోసం ఆకాశజ్యోతి ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శివరాత్రి రోజుల్లో లక్షలాదిగా భక్తులు వస్తుంటారు.



ఎస్.కోట పుణ్యగిరి కొండపై క్యూలైన్‌కు రంగులు

● రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం వద్ద శుక్ర, శనివారాల్లో జరుగనున్న మహాశివరాత్రి జాతరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. దర్శనం కోసం వచ్చే వారి కోసం మూడు రకాల క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ రెండు రోజుల్లో సుమారు రెండు లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రామకోనేరులో నీరు లేకపోవడంతో భక్తుల స్నానాల కోసం ప్రత్యేక కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆలయం వెనుక భాగాన కళ్యాణ మండపం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో కేశ ఖండన శాల ఏర్పాటుచేశారు.

విజయనగరంలో..

విజయనగరం శివాలయం వీధిలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, కోట జంక్షన్‌లో వున్న వీరరాజేశ్వర స్వామి ఆలయం, కొత్త అగ్రహారంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఇక వివిధ ఆధ్యాత్మిక సంఘాల పరిధిలో ఉన్న రింగురోడ్డులోని పశుపనాథేశ్వర స్వామి ఆలయం, బాబామెట్టలోని శివపంచాయతన ఆలయంలో గురువారం నాటికే ఏర్పాట్లు పూర్తిచేశారు.



రాజాం మండలం కంచరాం గ్రామ సమీపంలో మధ్యలో నిలిచిపోయిన టిడ్కో ఇళ్లు

పేదల ఇళ్లు పోతున్నాయ్

- ఐదేళ్లుగా వదిలేయడంతో నిరుపయోగం
- ఎక్కడికక్కడ చెదలు.. చుట్టూ పొదలు
- చోరీ అయిన ఐరన్, ఇతర సామగ్రి
- రాజాంలో టిడ్కో గృహాల దుస్థితి ఇదీ

పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన టిడ్కో గృహాలు దయనీయంగా ఉన్నాయి. వాటి నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కడి పనులక్కడే వదిలేసింది. ఈ దుస్థితిలో పడి ఐదేళ్లు కావడంతో నేడు అవి బలహీనం అవుతున్నాయి. చెదలు పెరిగి.. తుప్పు పట్టి.. గోడలు, స్లాబు పట్టుతప్పుతున్నాయి. కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్న పరిస్థితిని చూసే వారంతా ముక్కున వేలేసుకుంటున్నారు.

రాజాం, మార్చి 7:

రాజాం మున్సిపాలిటీ పేదల కోసం సమీప కంచరాం గ్రామం వద్ద 1104 టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టారు. 300, 365, 430 చదరపు గజాల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించి అందజేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 300 చదరపు గజాల ఇళ్ల వరకు పూర్తిచేశారు. మిగిలిన వాటికి పునాదులు, పిల్లర్ల వరకు నిర్మించాడు. కొన్ని ఇళ్లకు శ్లాబ్‌లు వేయడానికి సామగ్రి తెప్పించాడు. అంతలో ఎన్నికలు రావడం ప్రభుత్వం మారిపోవడంతో టిడ్కో గృహాల గతి కూడా మారి'పోయింది'. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్‌ను మార్చింది. పనులను మాత్రం చేయలేదు. ప్రస్తుతం వాటి పరిస్థితి దయనీయంగా ఉంది. నిర్మించిన ఇళ్లు కూడా పాడవుతున్నాయి. నిల్వ ఐరన్ తుప్పు పట్టింది. కొంత చోరీ అయింది.

● 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లను రూ.500కే ఇస్తుండగా మిగిలిన రెండు విభాగాల్లో 365 చదరపు గజాల విస్తీర్ణం ఇళ్లకు లబ్ధిదారు వాటాగా రూ.25వేలు, మూడో రకం ఇళ్లకు రూ.50వేలు కట్టించుకున్నారు. కొంతమంది లబ్ధిదారులు రెండు మూడు వాయిదాలు చెల్లించారు అయితే వీరు కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వలేదు. కాగా వై ప్రభుత్వం ఇటీవల జగనన్న కాలనీ పేరుతో ఇళ్లు మంజూరు చేసిన వారికి గతంలో ఇచ్చిన టిడ్కో పట్టాలను రద్దు చేశారు. లబ్ధిదారుల అభిప్రాయం తీసుకోకుండానే చేశారు.

● మొదట రాజాంలో 1104 గృహాల నిర్మాణం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 336కు తగ్గించింది. రూ.500కు ఇవ్వాలనుకున్న గృహాలను పూర్తిగా రద్దుచేసి వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చింది. 365, 430 చదరపు గజాల ఇళ్లను పూర్తి చేసి ఇస్తామని చెప్పుకొచ్చింది. నేటికీ అతీగతీ లేదు.

● మొదట పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సామగ్రిని వదిలిపెట్టి వెళ్లిపోయారు. అదంతా నేడు తుప్పుపట్టి కనిపిస్తోంది. గజాలు, యంత్రాలు, లారీలు, టిప్పర్లు అన్నీ పాడయ్యాయి. కొత్త కాంట్రాక్టర్‌కు చెందిన ఇంజనీర్లు వచ్చి అక్కడ ఉంటున్నారు తప్ప ఎటువంటి పనులు చేపట్టడం లేదు.

● గతేడాది డిసెంబరు నాటికి టిడ్కో గృహాలు పూర్తిచేసి అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం మాట మార్చింది. మార్చి 22 నాటికి అందజేస్తామంది. ఇప్పటివరకు పనులే చేపట్టలేదు.



తుప్పు పట్టిన గజాలు

ఇళ్లు నిర్మించి అందజేస్తాం


ప్రభుత్వ ఆదేశాల మేరకు టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టి అందజేస్తాం. లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం నిర్మాణాలు పూర్తిచేస్తాం. ఇందులో కొంతమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిన మాట వాస్తవమే.

\- కృష్ణారావు, కమిషనర్, రాజాం

23న ఎస్.కోటకు చంద్రబాబు

● రోడ్డు షోకు హాజరు

(శృంగవరపుకోట)



తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్.కోటలో రోడ్డు షో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి తెలిపారు. ఈ నెల 23న కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఏ సమయానికి వస్తారు? ఎన్ని గంటలు ఉంటారనే దానిపై ఇంకా షెడ్యూల్ ఖరారు కాలేదు. కొద్దిరోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో ఇప్పటికే అధినేత బిజీ అయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగానే జిల్లా వస్తున్నారు. రోడ్ షోకు ఇప్పటినుంచే సిద్ధమవుతున్నామని లలితకుమారి తెలిపారు. గత నెల 6న శంఖారావం సదస్సుకు టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ హాజరైన విషయం తెలిసిందే. అంతకుముందు యువగళం సదస్సుకు చంద్రబాబు, నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా భువనేశ్వరి జిల్లాకు వచ్చారు.



గట్టు చదును చేసి.. రోడ్డుగా నమ్మించేసి..

దత్తిరాజేరు మండలం కన్నాం గ్రామం నుంచి పెదకాద వెళ్లే మార్గమిది. ఇప్పటికే ఈ రెండు గ్రామాల మధ్య లింక్ రోడ్డు ఉంది. అయితే వచ్చిన గ్రాంటును ఏదోలా పనులు చూపించి బిల్లులు చేయించుకునేందుకు నాయకులు పథకం పన్నారు. ఆ ప్రకారం కావాలనే రోడ్డును ప్రతిపాదించారు. తోటపల్లి-గజపతినగరం సాగునీటి బ్రాంచి కాల్వ కోసం భూ సేకరణ చేసిన స్థలంలో గట్టును చదును చేసేసి రోడ్డుగా మార్చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో బిల్లులు నిలిచిపోయినట్లు సమాచారం.

\- దత్తిరాజేరు

అందని కందిపప్పు

● నిరాశ చెందుతున్న రేషన్ కార్డుదారులు



కలెక్టరేట్, మార్చి 7: జిల్లాలోని రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు అందించే కందిపప్పు ఈనెలలో నిలిచిపోయింది. గతంలో ఎప్పుడు లేనివిధంగా కందిపప్పు ధర పెరుగుతోంది. నిరుపేద, మధ్య తరగతికి చెందిన కార్డుదారులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసుకోలేని పరిస్థితి. ఈనేపథ్యంలో రేషన్ కింద ఇచ్చే పప్పు పేదలకు పెద్ద ఊరటగా ఉండేది. జిల్లా వ్యాప్తంగా 5,85,401 రైస్ కార్డులు ఉన్నాయి. రేషన్ డిపోల ద్వారా ప్రతి నెలా బియ్యం, గోధుమపిండి, పంచదారతోపాటు కందిపప్పు అందజేస్తున్నారు. ఈనెలలో బియ్యం, పంచదార, గోధుమపిండితో పాటు రాగి పిండిని పంపిణీ చేశారు. కందిపప్పు ఇవ్వలేదు. రేషన్ డిపోల ద్వారా కిలో కందిపప్పు రూ.67కు అందజేసేవారు. మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.200 పైబడి ఉంది. ఇదే విషయాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మధుసూధనరావు వద్ద ప్రస్తావించగా డిపోల ద్వారా కందిపప్పు పంపిణీ జరగలేదని, కందిపప్పు నిల్వలు రాష్ట్రానికి రాకపోవడంతో డిపోలకు సరఫరా చేయలేదని వెల్లడించారు.

మీడియా బాధ్యత కీలకం

● ఎన్నికల్లో ప్రెస్ కౌన్సిల్ మార్గదర్శకాలను అనుసరించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, మార్చి 7: ఎన్నికల నిర్వహణలో సిబ్బంది, అధికారులతో సమానంగా మీడియాకు బాధ్యత ఉంటుందని... ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఎన్నికల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికలు, అభ్యర్థులకు సంబంధించిన అంశాలపై పాత్రికేయులు వాస్తవమైన సమాచారంతో రిపోర్టింగ్ చేయాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం మతం, కులం, జాతి, వర్గం లేదా భాష ఆధారంగా ప్రజల మధ్య విద్వేషాన్ని పెంచే అంశాలపై రిపోర్టింగ్ చేయకూడదని చెప్పారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ జారీ చేసే సూచనలను ప్రజలకు, అభ్యర్థులకు తెలియజేసి అవగాహన కల్గించాలన్నారు. ముఖ్యంగా చెల్లింపు వార్తలు రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ అభ్యర్థి కోసం రాసారో ఆ అభ్యర్థి వ్యయంలో చెల్లింపు వార్త విలువ జమ అవుతుందని గుర్తుంచుకోవాలన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఉల్లంఘనలపై వార్తలు రాయడం ద్వారా అందరికీ అవగాహన కల్గించడానికి మీడియా కృషి చేయాలన్నారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం 1950 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాత్రికేయులకు ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల స్థలాలపై ఎన్నికలు కోడ్ లోగా పరిష్కరించాలని పాత్రికేయలు కోరగా, దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం స్థలం ఎక్కడ ఉన్నదీ గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. పాత్రికేయలకు అవసరమైన స్థలాలను గుర్తించాలని జేసీ కార్తీక్‌కు సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకర్, డీఆర్‌వో అనిత తదితరులు ఉన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

● జిల్లాలో కీలక అధికారులంతా మహిళలే

● మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ నాగలక్ష్మి



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మహిళలు

కలెక్టరేట్/ విజయనగరం క్రైమ్ : మార్చి 7: జిల్లాలో పాలనా పరంగా కీలక పదవులు నిర్వహిస్తున్న అధికారులంతా మహిళలేనని, అనేక రంగాల్లో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం సెలవు కావడంతో ఒక రోజు ముందే మహిళా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అనేక రంగాల్లో ఉద్యోగులుగా ఉంటూ నేడు మహిళలు ఆర్థికపరమైన స్వేచ్ఛను కలిగి ఉన్నారని, అయితే పనిచేసే చోట భద్రత కూడా అవసరమని చెప్పారు. మహిళల భద్రత కోసం కార్యాలయాల్లో ఇంటర్నల్ కమిటీలను నియమించాలని సూచించారు. దిశా యాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి పెడుతోందని చెప్పారు. ఆడ, మగ సమానమేనన్న భావన తల్లిదండ్రుల్లో కలగాలని, అప్పుడే సమాజంలో లింగ వివక్ష పోతుందని చెప్పారు. అనంతరం జిల్లా అధికారులను, వాణిజ్య, వ్యవసాయ, క్రీడలు, సేవా, చేనేత తదితర రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను కలెక్టర్ సన్మాంచారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ హిమబిందు, డివిజనల్ పీఆర్‌వో జానకమ్మ ఉన్నారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి: ఎస్పీ

మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్పీ దీపిక ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను పోలీసులు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కూడా ఎస్పీని సన్మానించారు.



ఎస్పీని సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష

బెలగాం: పోక్సో చట్టం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ విజయనగరం కోర్టు గురువారం తీర్పునిచ్చింది. సాలూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన పెరుమల్ల రమణయ్య(50) అదే గ్రామానికి బాలిక(8)తో అసభ్యంగా ప్రవర్తించి, ఇనుపరాడ్డుతో గాయపరచాడని సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2021లో కేసు నమోదయ్యింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి విచారించారు. నేరం రుజువు కావడంతో విజయనగరం కోర్టు ఫోక్సో చట్టం కింద నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. బాధితురాలికి రూ.1లక్ష నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది.

ఎం.లింగాలవలసలో చోరీ

దత్తిరాజేరు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఎం.లింగాలవలస గ్రామంలో చోటుచేసుకుంది. పెదమానాపురం ఎస్ఐ శిరీష గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నడిపల్లి కోదండపాని తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి మెంటాడ మండలం మీసాలపేట గ్రామంలో జరుగుతున్న తన బంధువు వివాహం నిమిత్తం ఈనెల 5వ తేదీన వెళ్లారు. మళ్లీ గురువారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోని బీరువాలో దాచిన మూడు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీ అయినట్లు నిర్ధారించుకుని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి పరిశీలించింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ దారపైడితల్లెమ్మ గుడి వద్ద పేకాటాడుతున్నవారిపై బుధవారం రాత్రి దాడి చేసి 17 మందిని అరెస్టుచేసినట్లు కొత్తవలస సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు దాడులను నిర్వహించామని చెప్పారు. ఈ మేరకు 17 మందిపై కేసునమోదు చేసి అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదలచేశామని తెలిపారు. వీరి నుంచి లక్షా 58 వేల 300 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కలెక్టరేట్ ఆడిటోరియంలో షార్ట్ సర్క్యూట్

కలెక్టరేట్: విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు రావడంతో సిబ్బంది ఆందోళన చెందారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా దినోత్సవం నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌కావడంతో మంటల వచ్చాయి. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది గమనించి అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమస్యను గుర్తించి సరిచేసిన తర్వాత విద్యుత్ పునరుద్ధరించారు. దీంతో కార్యక్రమానికి హాజరుకావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా కలెక్టరేట్ సముదాయంలో ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో పారిశుధ్య కార్మికులు చెత్తను ఒకచోట కుప్పగా ఉంచి అగ్నిపెట్టడంతోమంటలొచ్చాయి. దీంతో పైఉన్న విద్యుత్ వైర్లకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

పండ్ల తోటల దగ్ధం

వంగర: వీవీఆర్‌పేట, నీలయ్యవలసలో బుధవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పండ్ల తోటలు ఆహుతయ్యాయి. అటుగా వెళ్లిన పాదచారులు సిగిరెట్ తాగి విసిరేయడంతో అవి రాజుకుని మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. నీలయ్యవలసలో గ్రానైట్ యజమానికి చెందిన రెండు ఎకరాల మామిడి తోట, వీవీఆర్ పేటలో దత్తిఅప్పలనాయుడు, వెంకటనాయుడు, మురళికి చెందిన తోటలు దగ్ధమైనట్టు రైతులు తెలిపారు.

నీటి పథకాల వద్ద చెత్త తొలగించాలి

రాజాం: రక్షిత మంచి నీటిపథకాలు వద్ద పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ జె.నారాప్పల నాయుడు ఏఈ, సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించారు. మంచినీటి పథకాల వద్ద పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉండడంతో సిబ్బందిపై మండిపడ్డారు. యంత్రాలతో శుభ్రం చేయించారు.అక్కడ తుప్పుపట్టిన వాహనాలు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్ పాల్గొన్నారు.

మహిళల కోసం ప్రత్యేక చట్టాలు రావాలి

విజయనగరం రూరల్: మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు రావల్సి ఉందని ఉపాధ్యాయ సంఘ నేత, విశ్లేషకుడు బంకపల్లి శివప్రసాద్ చెప్పారు. గురువారం విజయనగరంలోని సంఘకార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామగ్రి ప్రారంభం

తెర్లాం: జన్నివలస అంగన్‌వాడీ కేంద్రంలో వాటర్ ప్యూరి ఫైర్, కుర్చీలు, డైనింగ్ టేబుల్, గ్యాస్‌స్టౌ ఫ్యాన్, డోర్‌మెట్స్, స్టీల్ సామగ్రిని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ బోడెల విజయబాబు ప్రారంభించారు. పోషణ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు రాగిపిండి తదితర పోషకాహారాన్ని పంపిణీచేశారు. కార్యక్రమంలోఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సత్యనారాయణ, వైస్ సర్పంచ్ మరడాన రమణ, పంచాయతీ కార్యదర్శి మీసాల స్వామి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

బొబ్బిలిలో శివజయంతి

బొబ్బిలి: బొబ్బిలి బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో గురువారం 88 వత్రిమూర్తి శివ జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. సంస్థ ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నేత బేబీనాయన పరమపిత శివప రమాత్మని పతాకాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

జేఎన్‌టీయూలో ఈఐఎస్ఈఎస్-2024 సదస్సు

విజయనగరంరూరల్: స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో ఈనెల ఆరోతేదీన ప్రారంభమైన ఈఐఎస్ఈఎస్-2004 జాతీయ సదస్సు గురువారం ముగిసింది.ఈసందర్భంగా విభాగాధిపతి అండ్ చైర్మన్ వి.మణికుమార్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. సదస్సుకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసులు, కిషోర్‌నాథ్, ఎం.శ్రావ్య, ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు చేయాలి

రామభద్రపురం: త్వరలో జరగనున్న ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ వద్ద విద్యుత్, తాగునీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో హెచ్‌డీటీ సుబ్బారావు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులుచదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. గుంటూరు జిల్లాలోని చిలకూరిపేటలో ఇటీవల జరిగిన 36వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు పతకాలు సాధించడంతో గురువారం విజయనగరంలో వారికిఅభినందించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడా రంగంలో దూసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎంఎస్ స్వరూప్, సుమన్, సతోఖాన్, పెంకి అశ్విని, గౌరీశంకర్, కె శ్రీనివాసరావు, శివకృష్ణ, రమణ, పాండ్రంకి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

తీర్మానంతో ఆశావర్కర్ పోస్టు భర్తీచేయాలి

రామభద్రపురం: నర్సాపురంలో ఆశావర్కర్ పోస్టును రాజ్యాంగ బద్ధంగా పంచాయతీ తీర్మానంతో భర్తీ చేయాలని టీడీపీ నాయకుడు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు కోరారు.గురువారం రామభద్రపురంలో విలేకరులతో మాటాడుతూ వైసీపీప్రభుత్వంలో సర్పంచ్‌లకు ఎటువంటి విలువలు ఇవ్వారా అని ప్రశ్నించారు. సర్పంచ్‌లకు ఏవిధమైన అధికారాలులేకుండా అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీపీలు వ్యవహరించడం సమంజసమేనా అని నిలదీశారు. ఇప్పటికే గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని దోచుకోవడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా చిన్నచిన్న పోస్టులు భర్తీ చేసుకుంటున్నారని ఆరోపించారు. నర్సాపురంలో ఆశావర్కర్ పోస్టు భర్తీ విషయంలో నిబంధనలు తుంగలో తొక్కి అర్హతలు లేకపోయినా ఎమ్మెల్యే సూచించిన వారికే ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి విధానం గత ప్రభుత్వంలో లేదని, అధికారపార్టీ నాయకుల పేరుచెప్పుకుని కార్యకర్తలు గ్రామాల్లో దందాలు చేస్తున్నారని ఆరోపించారు. సమవేశంలో తెలుగు మహిళ మరిపి గౌరీశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

- తెలుగుదేశం పార్టీ నాయకుల ధ్వజం
- బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

రాష్ట్రంలో సీఎం జగన్ అసమర్థపాలన సాగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలోచేరారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి: అదితి

విజయనగరం రూరల్: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు ఆరోపించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 14వ డివిజన్‌లోని కొత్తపేట శుద్దవీధి, పులిగెడ్డవారు వీధి, చెరువు గట్టు తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. మాజీ కౌన్సిలరు మద్దాల జగదాంబ, డివిజన్ ఇన్‌చార్జి మద్దాల నాగమ్మ, జనసేన నాయకులు చక్రవర్తి, శ్రావణి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: నాగార్జున

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని ఆ పార్టీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునతోపాటు పలువురు నాయకులు తెలిపారు.ఈ మేరకుటీడీపీ-జనసేన రాష్ట్ర కమిటీలు మంగళగిరిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేశారు. విజయనగరం అశోక్ బంగ్లాలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, పార్టీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజుతో పాటు, టీడీపీ బీసీ విభాగం నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు మాట్లాడు తూ బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌ని విడుదల చేశాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, కంది మురళీ నాయుడు, కోండ్రు శ్రీనివాసరావు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గదుల వెంకటరావు, చోడి ఆదినారాయణ పాల్గొన్నారు.

100 కుటుంబాలు టీడీపీలో చేరిక

రాజాం: టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. రాజాంలో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. తొలుత మునిసిపాలిటీలోని ఈశ్వరనారాయణ కాలనీకి చెందిన అల్లేన మురళీకృష్ణ, తోసంగి హారిక తదితర 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్‌ల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలంలోని సంకిలికి చెందిన 20 ఎస్సీ కుటుంబాలు, బీసీ యాదవులు 40 కుటుంబాలు, బూరాడ గ్రామానికి చెందిన 20 బీసీ కుటుంబాలు టీడీపీలో చేరాయి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ సీఎం అసమర్థ పాలనతో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పొట్టా చిట్టిబాబు, నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, శాసపు రమేష్‌కుమార్, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, జరజాన నీలయ్య, పిల్ల సత్యంనాయుడు, టంకాల కన్నంనాయుడు, కుమరాపు నీలకంఠం నాయుడు, యాగాటి భాను ప్రకాష్, బూరి గోవిందరావు, చిందిరాల అప్పల స్వామి, కిరణ్, గెంబలి కృష్ణ, గెంబలి సింహాచలం పాల్గొన్నారు.● **వంగర:** మండలంలోని రాజులగుమ్మకు చెందన వంశీ, అప్పలనాయుడుతో పాటు పలువురు వైసీపీని వీడి నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రుమురళి మోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావునాయుడు, మోహనరావు, ఎల్‌కృష్ణమూర్తి, ధనలక్ష్మి శ్రీనివాస్, రవి, ధనలక్ష్మి, నారాయణరావు, వంగా వెంకటరావు, జైరాం పాల్గొన్నారు.

పాములవలస, పాతరేగ గ్రామస్థులు టీడీపీలో చేరిక..

బొబ్బిలి: తెర్లాం మండలంలోని పాములవలసకు చెందిన 20 కుటుంబాలు, రామభద్రపురం మండలంలోని పాతరేగ నుంచి 40 కుటుంబాలు బొబ్బిలి దర్బారు మహల్‌లో టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో టీడీపీలో చేరాయి. పాములవలసకు చెందిన ఉపసర్పంచ్ పుట్టపు లక్ష్మి, సత్యానారాయణ ఆధ్వ ర్యంలో గ్రామానికి చెందిన బత్తుల సురేష్, పుట్టపు వెంకటరమణ, సన్యాసి రావు, నరసింహారావు, రాంబాబుకాళ్ల సూర్యనారాయణ, తౌడు, సింహాద్రి తదితర 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ తెర్లాం మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయు డు, వెంకటేష్, రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి అమరాపు సురేష్ పాల్గొన్నారు. అలాగే రామభద్రపురం మండలంలోని పాతరేగ నుంచి 40 కుటుంబాల వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి.గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు లోకారపు నాయనప్ప, మార్పిన ముత్యాలు, గొట్టాపు సన్యాసినాయుడు, లక్ష్మునాయుడు, పెద్దింటి చిన్నంనాయుడు, సబ్బారపు తాతబాబు, గిరిడి బిల్లి కృష్ణ, లోకారపు నాగేశ్వరరావు, సింగనపల్లి సత్యం చేరారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు మడక తిరుపతినాయుడు, పైల నాగరాజు, లోకాపు రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు కరణం భాస్కరరావు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: నగర పాలకసంస్థ పరిధిలో 14వ డివిజన్‌లో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న అదితి గజపతిరాజు

బొబ్బిలిలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

బొబ్బిలి ఇందిరమ్మకాలనీలో గురువారం టీడీపీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ప్రారంభించారు. కాలనీ నాయకులు తెర్లి రామ్మోహనరావు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బేబీనాయన మాట్లాడుతూ ఇటీవల పార్టీలో చేరిన నాయకులతో కలిసి అందరూ సమన్వయంగా పనిచేసి ఎన్నికల్లో భారీ ఆధికత్యను సాధించాలన్నారు. కార్యక్రమంలోటీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుంకరి సాయిరమేష్ పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: జయహో బీసీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు



రాజాం: టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న కోండ్రు మురళీమోహన్



బొబ్బిలి: టీడీపీలో చేరిన వారితో బేబీనాయన, తెంటు

అవినీతిపై వాడీవేడి చర్చ

- బొబ్బిలి మునిసిపాలిటీలో ధ్వజమెత్తిన టీడీపీ కౌన్సిలర్లు
- వాటర్‌వర్క్స్‌పై కమిటీ ఏర్పాటుచేయండి: కౌన్సిలర్ రాంబార్కి
- భూకబ్జాలపై ఉద్యమం చేస్తా: వైస్‌చైర్మన్

బొబ్బిలి: బొబ్బిలి మునిసిపాలిటీలో అవినీతిలో వాడివేడి చర్చ జరిగింది. ఇక్కడ అవినీతి కార్యకలాపాలు పెచ్చుమీరిపోయాయని టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. గురువారం మునిసిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు సమక్షంలో ఎనిమిదో వార్డు టీడీపీ కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు పలు అంశాలపై అధికారులను నిలదీశారు. వాటర్‌వర్క్స్‌లో అవినీతి పేరుకుపోయిందని, ప్రతి కౌన్సిల్‌లో వాటర్‌వర్క్స్ నిర్వహణకు లక్షలాది రూపాయలను జనరల్‌ఫండ్ నుంచి వెచ్చిస్తున్నట్లు తీర్మానాలు చేస్తున్నారని, తాగునీటి సరఫరా అత్యవసర పనుల కోసమని చెప్పడంతో కౌన్సిల్ కూడా కిమ్మనకుండా ఆమోదం తెలుపుతోందని ప్రశ్నించారు. ఇదేఅదనుగా ఇష్టారాజ్యంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నటు ఆరోపించారు. పట్టణంలోని పలు వార్డుల్లో వేసిన రోడ్లు ఆరునెలల వ్యవధిలోనే పూర్తిగా పాడైపోయాయని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈవిషయంపై ఏఈలు రవి, సురేష్ మాట్లాడుతూ రోడ్లపై ఫినిషింగ్ మాత్రమే చూపవద్దని, రోడ్ను బలాన్ని పరిగణిం చాలన్నారు.అయితే శరత్‌బాబు, ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు, వెలగాడ హైమావతి సంతృప్తి చెందకపోవడంతో చైర్మన్ కలుగజేసుకొని క్వాలిటీ కంట్రోల్ పనితీరు బాగోలేదని,అందుకే ఆ ఏజెన్సీని మార్చుతున్నట్లు తెలిపారు. షాపింగ్‌కాంప్లెక్స్‌ల్లో షాపుల కేటాయింపు, అద్దె బకాయిల వసూళ్లపై అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై శరత్‌బాబుతోపాటు ఇంటిగోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో వాయిదావేసిన అంశాన్ని మళ్లీ అలాగేచేర్చారని, అద్దె బకాయిలను సామాన్యుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, షాపుల లీజుల దారుల నుంచి ఎందుకు వసూలు చేయడంలేదని ప్రశ్నించారు. వాటర్‌వర్క్స్, షాపింగ్‌కాంప్లెక్స్‌లపై ఓ కమిటీని ఏర్పాటు చేయాలని రాంబార్కి, ఇంటి డిమాండ్ చేశారు.దీనికిబొత్స రమణమ్మ, చోడిగంజి రమేష్‌నాయుడు, పాలవలస ఉమా శంకర్ మద్దతుపలికారు. ఇందిరమ్మకాలనీలో అక్రమాలపై ఇంటి గోవిందరా వు నిలదీశారు. ఇళ్లస్థలాలు పెద్దఎత్తున కబ్జా జరగుతున్నాయని, ఆ కాలనీలో ఆరుగురు అజమాయిషీచేస్తున్నారని, ఇందులో విలేకరులపాత్ర కూడా ఎక్కు వగా ఉందని ఆరోపించారు. వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలిలో ప్రభుత్వస్థలాల ఆక్రమణలపె ఉద్యమంచేస్తానని తెలిపారు. అనంత రం ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు మాట్లాడుతూ మునిసిపాలిటీలో కౌన్సిలర్లంతా వ్యక్తంచేస్తున్న ఆవేదనను చూస్తుంటే అధికారుల పర్యవేక్షణ సక్రమంగాలేనట్లుగా అనుమానంగాఉందని, ఆరోపణలుచేస్తున్న అంశాలపై కమిటీలు వేసి నిగ్గుతేల్చాలన్నారు. ఒక వేళ ఎక్కడైనా అవినీతి జరిగినట్లు నిరూపిస్తే సంబంధిత అధికారులపై గట్టి చర్యలు తీసుకుం టామన్నారు.ఈ టర్మ్‌కి నాకు ఇదే ఆఖరి సమావేశమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీఆదరించి తనను గెలిపిస్తే కౌన్సిల్‌లోకి అడుగుపెడతానని చెప్పారు. తరువా త కూడా కౌన్సిలర్లు పలు వార్డు సమస్యలు, అక్రమాలపై అధికారులను నిలదీ శారు. టీడీపీ కౌన్సిలర్లు దాసరి సురేష్, కాకల గోవిందమ్మ, వెలగాడ హైమావతి తమ వార్డుల్లో సమస్యలపై ప్రశ్నించారు.సమావేశంలో కమిషనరు లాలంరామలక్ష్మి, ఆర్వోప్రసాదరావు, సురేష్‌బాబు, ఆర్ఐ త్రినాథ, టీపీఓ వరప్రసాద్, టీపీఆర్ఓ వరప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు సోమేశ్వరరావు పాల్గొన్నారు.



మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

11న అప్రెంటీస్ మేళా

కొత్తవలస: విజయనగరంలో వీటీ అగ్రహారంలోగల ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి ఎస్.బీమ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమల్లో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు స్టయిపండ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

'ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం'

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర అభివృద్ధే పార్టీ లక్ష్యమని ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ ఆనందసాగర్ తెలిపారు. గురువారం విజయనగరం ఉడాకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో పార్టీ తరపున పోటీచేసే ఆసక్తి గల అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి వాసురాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

358 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

లక్కవరపుకోట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 31 పంచాయతీలకు చెందిన 358 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను గురువారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జడ్పీటీసీ టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యానశాఖాధికారిగా ఉమాభరణి

విజయనగరం రింగురోడ్డు: స్థానిక నగరపాలక సంస్థ ఉద్యానశాఖాధికారిగా బి.ఉమాభరణి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈమేరకు కమిషనర్ మల్లయ్య నాయుడిను కలిశారు. పాయకరావుపేటలో ఉద్యానశాఖ అధికారిగా సేవలందించి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి రైల్వేగేట్ సమీపంలో షిర్డీసాయి బాబా ఆలయ 24వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు పీఠం వ్యవస్థాపకుడు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగాయి.

చేయూత నిధులు విడుదల

కలెక్టరేట్: వైఎస్ఆర్ చేయూత నిధులను సీఎం జగన్ విడుదల చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆన్‌లైన్‌లో ద్వారా అనకాపల్లి నుంచి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నాగలక్ష్మి మాట్లాడుతూ ఒక్కో మహిళకు రూ.18,750 చొప్పున 1,43,280 మంది రూ.268.65 కోట్లు అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, మెప్మాపీడీ సుధాకర్, గ్రామవార్డు సచివాలయం సమన్వయ అధికారి నిర్మలాదేవి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది తీరు దారుణం

శృంగవరపుకోట రూరల్: తమసచివాలయ సిబ్బంది తనకు కనీస విలువ ఇవ్వడంలేదని సర్పంచ్ ఆదారి మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గోపాలపల్లి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రామసభ వద్ద ఆయన మాట్లాడుతూ తాను ఎప్పుడు గ్రామసభ ఏర్పాటుచేస్తానని చెప్పినా వారు ఉండడం లేదన్నారు. పంచాయతీ కార్యాలయానికి వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని..దీనివల్ల అనేకసార్లు గ్రామసభలు రద్దు చేశామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేద్దామనుకుంటే సచివాలయ సిబ్బంది సహకరించకపోవడం మనోవేదనకు గురిచేస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్, వార్డు సభ్యులు తెలిపారు.

రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు

శృంగవరపుకోట రూరల్: ధర్మవరంలో గ్రావెల్ మాఫియా తమకు నిద్రలేకుండా చేస్తోందని స్థానికులు వాపోతు న్నారు. గురువారం ఎస్సీ కాలనీవాసులు, యాతపేట వాసులు మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా స్థానిక దెయ్యాలమెట్ట నుంచి రూ.లక్షల విలువ చేసే గ్రావెల్‌ను రాత్రివేళల్లో అక్రమంగా తరలిస్తున్నారనితెలిపారు. తాము ఆపి ప్రశ్నిస్తే... తిరిగి బెదిరిస్తున్నారని వాపోయారు. వేసవి కాలం కావడంతో బయట నిద్రిస్తున్న తమపై బుగ్గి వెదజల్లుతున్నారని.. దీని వల్ల ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా... దీనిని పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వైసీపీ పాలనలో వైద్యంపై నిర్లక్ష్యం

- శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి

కొత్తవలస: వైసీపీ పాలనలో వైద్య సదుపాయాలపై నిర్లక్ష్యం చేసిందని శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. గురువారం కొత్తవలసలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఎన్టీఆర్ సేవాసమితి ట్రస్టు, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు-నేడు పనులంటూ ముందుగా ఉన్న వైద్యశాలలను పడగొట్టారని, కొత్తవి కట్టడానికి నిధులు మంజూరు చేయకపోవడంతో పునాదుల దశలోనే నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలు అద్దె భవనాల్లోనే ఉన్నాయన్నారు. ఆసుపత్రులకు అవసరమైన బడ్జెట్ కేటాయించకపోవడంతో సరైన మందులు కూడా లేవన్నారు. విశాఖకు చెందిన గీతం వైద్యశాల, జిమ్‌సర్ వైద్యశాలల వివిద విభాగాలకు చెందిన వైద్యులు 400 మందికి వివిద రకాల వ్యాధులకు సంబంధించి తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీనాయకులు కేటీపీ రాంప్రసాద్, శ్రీను,బొబ్బిలి అప్పా రావు, కనకాల శివ, బంగారు రమేష్, రత్నాజీ, నక్కరాజు చిన రాము పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న లలితకుమారి

క్షయ వ్యాధి నమూనాల సేకరణపై శిక్షణ

విజయనగరం రింగురోడ్డు: జిల్లా క్షయ నివారణ కేంద్రం, ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేటివ్ న్యూ డయోగ్నోస్టిక్ సర్వీసెస్ సంయుక్తంగా టీబీ ఇంప్లిమేంటేషన్ ఫ్రేం వర్క్ అగ్రిమెంటులో భాగంగా గురువారం ఓప్రైవేటు హోటల్‌లో చిన్నపిల్లల్లో క్షయ వ్యాధికి సంబంధించిన నమూనాల సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పట్టణ, ప్రాథమిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు,సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ భాస్కరరావు మాట్లాడుతూ చిన్నపిల్లల్లో క్షయని గుర్తించడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు అవసరమన్నారు. ఆసుపత్రి సమన్వయ అధికారి డాక్టర్ గౌరీశంకరరావు మాట్లాడుతూ ప్రతి సీహెచ్‌సీలో చిన్నపిల్లలకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ రాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రదేవ్ వర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంకిలిలో 52 మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని సంకిలిలో గురువారం రాత్రి 52 మద్యం సీసాలు స్వాధనం చేసుకునిసీజ్‌చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తుండగా పట్టుకుని కేసునమోదుచేసినట్లు చెప్పారు.

తప్పులు ఎత్తి చూపినందుకే డీఈఈ బదిలీ

- బొబ్బిలి టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు

బొబ్బిలి: మునిసిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వేలెత్తి చూపారన్న అక్కసుతో డీఈఈని కొద్ది రోజులకే ఇక్కడ నుంచి బదిలీ చేయించారని టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, కౌన్సిలర్లు ఆరోపించారు. గురువారం స్థానిక మునిసిపల్ తాగునీటిరిజర్వాయర్ ప్రాంగణంలో వృథాగా పడిఉన్న లక్షలాది రూపాయల విలువ చేసే వాల్వ్‌లను వారు విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ రెండునెలల కిందట మునిసిపల్ డీఈఈగా చేరిన కనకరాజును ఆగమేఘాల మీద ఇక్కడ నుంచి ఈఅండ్‌సీ కార్యాలయానికి పంపించడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. గతఏడాది మార్చిలో ఒక్కక్కటి 1.06 లక్షల రూపాయల విలువ చేసే ఐదు వాల్వ్‌లకు కౌన్సిల్ అనుమతి ఇచ్చిందన్నారు. కిర్లోస్కర్ కంపెనీకి చెందిన వాల్వ్‌లకు బదులుగా కేవలం ఒక్కక్కటి 35 వేల రూపాయల విలువ చేసే లక్ష్మి కంపెనీకి చెందిన వాల్వ్‌లు మాత్రమే కొనుగోలు చేశారని, వాటిని కూడా ఏడాదవుతున్నా ఇంతవరకు వినియోగించకుండా మూలన పడేశారని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ కోసం తాము డిమాండ్‌చేస్తున్నామని, లేకుంటే నేరుగా ఫిర్యాదుచేస్తామని హెచ్చరించారు. కౌన్సిలరు వెలగాడ హైమావతి మాట్లాడుతూ ప్రజల ముక్కుపిండి వసూలు చేసిన పన్నుల సొమ్ములో కోట్లాది రూపాయలను దుబారా చేస్తూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వాటర్‌వర్క్స్‌లో నిధుల గందరగోళంపై దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారి వెంట కౌన్సిలర్లు కింతలి శ్రీదేవి, దాసరి సురేష్, కాకల గోవిందమ్మ ఉన్నారు.



ఏడాదిగా వినియోగించని పరికరాలను పరిశీలిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

బస్సులు లేక..ప్రమాద ప్రమాణం

- విజయనగరంలో ఇంటర్ విద్యార్థుల అగచాట్లు



విజయనగరం (ఆంధ్రజ్యోతి): ప్రమాదమని తెలిసినా విద్యార్థులకు తప్పడంలేదు. గురువారం విజయనగరంలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పలు ప్రాంతాల్లో సకాలంలో కేంద్రాలకు చేరుకోవడానికి సరిపడా బస్సులులేవు. దీంతో ఎలాగైనా నిర్దేశిత సమయానికి ముందే ఆటోలు, బస్సుల్లో వేలాడి, ఒక్కో ద్విచక్రవాహనంపై ముగ్గురు, నలుగురు వెళ్లాల్సివచ్చింది. సమయం మించిపోతుండడంతో కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలు నిబంధనలకు మించి వేగంతో డ్రైవ్ చేయాల్సివచ్చింది.



'వాటర్‌వర్క్స్‌లో కుంభకోణంపై విచారణ చేయాలి'

బొబ్బిలి: భోజరాజపురం వాటర్‌వర్క్స్‌లో లక్షల రూపాయల కుంభకోణంపై విజిలెన్స్, ఏసీబీ విచారణ నిర్వహించాలని అంబేడ్కర్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా, మునిసిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై అన్ని దర్యాప్తుసంస్థలు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితంలేకుండాపోయిందని తెలిపారు. గురువారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ అసైన్డ్, ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలపై సర్వేనెంబర్లు, ఇతర ఆధారాలతో లేఖలు పంపినా చర్యలు తీసుకోలేద న్నారు. పట్టణంలో వందెకరాల చెరువుల్లో బహుళ అంతస్థులు అక్రమంగా వెలిశాయని, లంచాలు భోంచేసిన అధికారులు వాటివైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. వాటర్‌వర్క్స్‌లో కుంభకోణంపై ప్రజాసంఘాల సదస్సు నిర్వహిస్తామని సాంబయ్య తెలిపారు. అలాగే అవినీతి రహిత పరిపాలన అంటే ఇదేనా అని పీసీసీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు నిలదీశారు.ఆయన విలేకరులతో మాట్లాడుతూ మునిసిపాలిటీలో ఎప్పటి నుంచో అనేక అవినీతి కార్యకలాపాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే స్పందించి అవినీతి వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐఎఫ్‌పీతో సులభతర బోధన

రేగిడి: ఉపాధ్యాయులకు అందిస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పి) శిక్షణ విద్యార్థులకు సులభతర బోధనకు దోహదపడుతుందని డీఆర్‌పీలు వై.సీతం నాయుడు, మురపాక గణేష్‌లు పేర్కొన్నారు. ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఐపీఎఫ్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియపై గురువారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

లెండీలో ముగిసిన 'లక్ష్య'

డెంకాడ: లెండీ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థి సంఘ వార్షికోత్సవం (లక్ష్య-2024) గురువారం ముగిసింది. సాంకేతిక విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి కె.సుబ్బరామయ్య బహుమతులు ప్రదానం చేశారు. వైస్ చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు

గజపతినగరం: మండలంలోని శివాలయాలు మహా శివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. గంగచోళ్లపెంటలోని జ్ఞానానంద సరస్వతి ఆశ్రమంలో ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. సీతారామస్వామి గ్రూపు దేవాలయంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలకు తగిన ఏర్పాట్లు చేశారు. లింగాలవలస, సంతతోట ఆవరణలోగల శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ● **వంగర:** మహాశివరాత్రి పురస్కరించుకుని సంగాంలో శుక్రవారం నుంచి జరగనున్న జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర తెలిపారు. గురువారం రాత్రి సంగాంలో జాతరకు విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజాం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జనార్దనరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

గరివిడి: విశాఖపట్నంలోగల పీఎఫ్ కార్యాలయం వద్ద గరివిడి ఈపీఎఫ్ పెనన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.గౌరునాయుడు, సలీం బి.జగదీష్, పిసిని రామ్మూర్తి, బొర్లి పైడినాయుడు పాల్గొన్నారు. అనంతరం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

నీరు రాకుండా కొళాయిలు ఎందుకు?

● కాంట్రాక్టర్‌ను నిలదీసిన లక్ష్మింపేట సర్పంచ్

వంగర: లక్ష్మింపేటకు వేసిన మోటార్లు మొదట్లోనే మరమ్మతులకు గురయ్యాయని.. దీంతో పైపులైన్ ను కాంట్రాక్టర్ తొలగించారని.. పైపులైను లేకుండా గ్రామంలో కొళాయిలు ఎలా వేస్తారని స్థానిక సర్పంచ్ ఆవు కల్యాణి నిలదీశారు. తనకు చెప్పకుండా కాంట్రాక్టర్ కొళాయి దిమ్మలు నిర్మిస్తుండడంతో సర్పంచ్ అడ్డుకున్నారు. గ్రామానికి నీరు రాకుండా కొళాయిలు ఎందుకు వేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడని సర్పంచ్ చెప్పారు. నీరు రాకుండా కొళాయిలు బిగించి బిల్లులు కాజేయాలని కాంట్రాక్టర్ ప్రయత్నించడంతో అడ్డుకున్నట్లు సర్పంచ్ చెప్పారు. టీడీపీ సానుభూతి పరురాలిననే కారణంతో తనను పట్టించుకోకుండా పనులు చేపడుతు న్నారని.. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

ఉపాధి కూలీల వేతనాలు పెంచాలి

● వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయుడు


మాట్లాడుతున్న శ్రీనివాస్

రామభద్రపురం: ఉపాధి కూలీల వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె శ్రీనివాస్‌నాయుడు కోరారు. గురువారం రామభద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజుకు రూ.600 కూలీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు 200 రోజుల పని కల్పించాలని తెలిపారు. రెండు పూటలా పని పెట్టడం వల్ల కూలీలు ఎండలో మగ్గిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, సబ్సిడీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు మాత్రం కనీస గిట్టుబాటు ధర కల్పించడం లేదని విమర్శించారు. అనంతరం కొండకెంగువలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవ్వా ధర్మారావు, సీఐటీయూ మండల కార్యదర్శి బలసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలే మహారాణులు

● సమాజాభివృద్ధిలో వారి పాత్ర కీలకం

● అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు

చీపురుపల్లి: మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ఉనికిని చాటుకుని మహారాణులుగా వెలుగొందుతున్నారని జూనియర్ సివిల్ న్యాయాధికారి విజయరామేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలు, మహిళలు తమ భవిష్యత్తును సుందరంగా మలచు కోవాలన్నారు. హెచ్‌ఎం కె.చంద్రశేఖర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలో మహిళా ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్డీవో బి.శాంతి ఈ ర్యాలీని ప్రారంభించారు. మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అన్నపూర్ణాదేవి, మహిళా తహసీల్దార్లు, ఉద్యోగులు, సచివాలయ మహిళా సిబ్బంది పాల్గొన్నారు. **గజపతినగరం:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. గురువారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్య నేర్చుకో విలువ పెంచుకో అనే నినాదంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో జయింతి ప్రసాద్, తహసీల్దార్ సీహెచ్ వి.రమేష్, ఐసీడీఎస్ పీవో నాగమణి పాల్గొన్నారు. **రాజాం:** మహిళలు అన్నిరంగాలో రాణించాలని తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా రాజాంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. **బొబ్బిలి:** బొబ్బిలిలో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో మునిసిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు, కమిషనర్ లాలం రామలక్ష్మి, మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీల్లో ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు, సీనియర్ నాయకుడు బంకురు జోగినాయుడు ఆధ్వర్యంలో 40 మంది మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ స్వప్న, జీజీహెచ్ హెచ్‌ఎం యశోద సిబ్బంది పాల్గొన్నారు. అలాగే యూటీఎఫ్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్య క్రమంలో మహిళా హక్కులు, సాధికారిత, సమస్యలపై రాష్ట్ర నేత కె.విజయ గౌరి, పుణ్యవతి, కామేశ్వరి తదితరులు ప్రసంగించారు. **విజయనగరం రింగురోడ్డు/ విజయనగరం రూరల్/దాసన్నపేట:** సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని మదర్‌థెరిస్సా సేవా సంఘం అధ్యక్షుడు త్యాడ ప్రసాద్ పట్నాయక్ తెలిపారు. విజయనగరంలోని అయ్యన్నపేటలోని మదర్‌థెరిస్సా కిడ్స్ స్కూల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. పెదతాడి వాడ హైస్కూల్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పట్నాయకుని మాలతీని సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పట్నాయక్, శ్రీనివాస్, శ్రావణి, సుజాత, హైమ, కాంచన పాల్గొన్నారు. ఉడాకాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు జామి అప్పలసూరి ఆధ్వర్యంలో మహిళా దినో త్సవం నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు రమణమూర్తి, నాలుగెస్సల రాజు, త్యాడ చిరంజీవి, ఎర్రినాయుడు పాల్గొన్నారు ఎల్ఐసీ కార్యాలయ సమీపంలోని యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ మేనేజరు నరేష్, డిప్యూటీ రీజినల్ మేనేజరు మాధురి, సంఘ అధ్యక్షులు ప్రసాద్, మురళీశ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** నగర పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ రామారావు, కారుకొండ కృష్ణారావు, కమిషనర్ పి.బాలాజీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం, చీపురుపల్లి: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి విజయరామేశ్వరి


రాజాం: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


బొబ్బిలిలో..


విజయనగరంలో మహిళలను సన్మానిస్తున్న మదర్ థెరిస్సా సేవా సంఘం సభ్యులు

బీసీ డిక్లరేషన్‌తో అట్టడుగు వర్గాలకు లబ్ధి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గంట్యాడ: తెలుగుదేశం, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో అట్టడుగు వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరనున్నదని స్థానిక టీడీపీ మండల నాయకులు అన్నారు. గురువారం గంట్యాడలోని కేపీఎస్ బీఈడీ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ హయాంలోనే బీసీలకు అనేక విధాలుగా మేలు జరిగిందని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్యాయం జరిగిందన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో టీడీపీ టికెటు కేఏ నాయుడుకి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఈనెల 13 తర్వాత బీఫారం ఏవరికి ఇస్తే వారికే తాము పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండపల్లి భాస్కర్ నాయుడు, అల్లు విజయకుమార్, రొంగళి కృష్ణ, బూడి అప్పలనాయుడు, రంధి చినరామునాయుడు, పి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

లింగ వివక్షపై అవగాహన కల్పించాలి

● డీఆర్డీఏ ఏపీడీ సావిత్రి


మాట్లాడుతున్న ఏపీడీ సావిత్రి

నెల్లిమర్ల: లింగ వివక్షపై డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని డీఆర్డీఏ ఏపీడీ కె.సావిత్రి అన్నారు. వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో వీవోఏలకు జెండర్‌పై జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్షపై మరింత అవగాహన కల్పించాలన్నారు. మధ్యలో చదువు ఆపేసిన ఆడ పిల్లలను గుర్తించి వారి కుటుంబాలకు అవగాహన కల్పించి, తిరిగి పాఠశాలలో ప్రవేశ పెట్టే ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ బి.బంగారమ్మ, జిల్లా జెండర్ రీసోర్స్ పర్సన్ కె.గీత, పి.గురుమూర్తి, ఏపీఎం లోపింటి సత్యనారాయణ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

లింగ వివక్షను వ్యతిరేకిద్దాం

బొండపల్లి: సమాజంలో లింగ వివక్షను వ్యతిరేకించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.సౌమ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎ.పార్వతి, టి.కనక మహాలక్ష్మి, పాల్గొన్నారు.

నియంత పాలనకు స్వస్తి పలకాలి


ప్రచారం చేస్తున్న మాధవి

నెల్లిమర్ల: మల్యాడ గ్రామంలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి గురువారం పర్యటించారు. ఈసందర్భంగా దళిత మహిళలతో మాట్లా డారు. వచ్చేది జనసేన- టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. జగన్మోహన్ రెడ్డి నియంత పాలనకు స్వస్తి పలకా లని కోరారు. ఆమె వెంట జన సైనికులు ఉన్నారు.

'నవ సమాజ నిర్మాణానికి కృషి చేస్తా'

డెంకాడ: నవ సమాజ నిర్మాణానికి కృషి చేసానని ఉత్తరాంధ్ర సమాజ్‌వాద్ పార్టీ ఇన్‌చార్జి, విశాఖపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జి జలాది విజయ అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమాజ్‌వాద్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కర్రి కృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈస్ట్ నియోజకవర్గం ఇన్‌చార్జి, రాష్ట్ర మహిళా ప్రెసిడెంట్ కోన విజయలక్ష్మి, విజయనగరం జిల్లా అధ్యక్షుడు శంబాన శ్రీనివాసరావు, విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కరుణాకర్ పాల్గొన్నారు.

రాణి అప్పలకొండయ్యంబ సేవలు ఆదర్శం

విజయనగరం: ప్రజా సమస్యలను గుర్తించడం.. వాటి పరిష్కారానికి అహర్నిశలూ కృషి చేయడం ద్వారా నాయకత్వ లక్షణాలున్న మహిళామణిగా రాణి అప్పలకొండయ్యంబ గుర్తింపు పొందారని ఎమ్ఆర్ పీజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. కోటలోని కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విజయనగరం పట్టణ ప్రజల దాహార్తిని గుర్తించి తాగునీటి సమస్య పరిష్కారానికి రాణి కృషి చేశారన్నారు. మహిళలు ప్రసూతి సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి... ఘోషాసుపత్రిని నిర్మించారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఆర్ పీజీ మేనేజ్‌మెంట్ బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, మహిళా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రీ ఫైనల్ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

గరివిడి: దువ్వాం గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని, దేవాడ గ్రామంలో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాన్ని రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జేసీ కె.కార్తీక్, ఆర్డీవో బి.శాంతి, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, బొత్స సందీప్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

డెంకాడ: మండలంలో 1,963 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీ చంద్రశేఖర్ చేతులమీదుగా గురువారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద 3,837 మంది లబ్ధిదారులకు చేయూత పథకం కింద సుమారు రూ.7కోట్ల 26లోల 18వేల 750 కోట్ల విలువైన చెక్కును పంపిణీ చేశారు.